


ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 222 మంగళవారం 25 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

## స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ


**జిల్లాల వారీగా రిజర్వేషన్ల గెజిట్లు**

**సర్కార్‌కు సమర్పించిన కలెక్టర్లు**

**హైకోర్టు విచారణ నేటికి వాయిదా**

**తేలని 27 జీపీల ఎన్నికల పంచాయితీ**

హైదరాబాద్**నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు సోమవారం లేఖ రాసింది. రిజర్వేషన్ల ప్రక్రియ వివరాలను సమర్పించిన ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గత రెండు రోజులుగా దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసిందిమిగతా 2లో...






## కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం

**కొత్త సీజేఐకి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

**2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్**

**పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ న్యాయమూర్తులు హాజరు**

ఢిల్లీ **నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' లో పేర్కొన్నారు. అనేక చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్, ఇటీవలి సంప్రదాయానికి భిన్నంగా దైవసాక్షిగా హిందీలో ప్రమాణం చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, హర్యానా ముఖ్యమంత్రి నాయిబ్ సింగ్ సైనీ హాజరయ్యారుమిగతా 2లో...

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్**

**అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం**

**సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి**

కొడంగల్, **నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు.మిగతా 2లో...




# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

**విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**అధికారులో డిప్యూటి సిఎం వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్, **నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ మిగతా 2లో...





## అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

**రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు**

**రెండేళ్లలో ఎన్నడూ లేనంత తగ్గింపుకు చమురు**

**బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపు ధర**

రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత్ కు భారీ డిస్కౌంట్‌తో ఆయిల్ విక్రయించేందుకు రష్యా సిద్ధమైంది. రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. దీంతో క్రూడాయిల్ ధరలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడి చమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి.
మిగతా 2లో...

## విద్య ద్వారానే సమాజంలో మార్పు



**సమాజంలో మార్పు కోసమే నైతిక విలువలతో కూడిన విద్య: మంత్రి నారా లోకేశ్**

**మహిళలను గౌరవించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు తెస్తున్నామన్న లోకేశ్**

**పెట్టుబడులతో పాటు నైతిక విలువల్లోనూ ఏపీని అగ్రగామిగా నిలుపుతామన ధీమా**

**తల్లిదండ్రుల నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టాలని పిలుపు**

**నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలోనే కాకుండా, నైతిక విలువలను పెంపొందించడంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఆయన ఉద్ఘాటించారు.
మిగతా 2లో...

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం

**ఒకేసారి 8 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసిన మాదాపూర్ ఎస్ఓటీ**

**న్యూ ఇయర్ వేడుకలే లక్ష్యంగా బెంగళూరు నుంచి డ్రగ్స్ సరఫరా**

**నిందితుల నుంచి హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం**



2లో.

# ఆయుధాలు వదిలేస్తాం

## మావోయిస్టుల బహిరంగ లేఖ..

**ఫిబ్రవరి వరకు సమయం కోరిన మావోయిస్టులు**

**భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు ఆపేయాలని డిమాండ్**

**ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లను ఉద్దేశించి లేఖ**

**నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** మావోయిస్టులపై సీరియస్ గా దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చిలోగా మావోయిస్టులను ఏరివేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా భద్రతా బలగాలతో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ
మిగతా 2లో...



# కాంగ్రెస్ ద్రోహం

**కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తాం**

**42శాతం ఇవ్వకుండా దేశమంతా రాహుల్ ప్రయారం**

**రాహుల్ బిసి వ్యతిరేకతను ఢిల్లీలోనే ఎండగడతాం**

**వచ్చే పార్లమెంటులో దీనిపై రాహుల్ చర్చించాలి**

**బిఆర్ఎస్ నేతల సమావేశంలో కెటిఆర్ వెల్లడి**

హైదరాబాద్,**నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు.మిగతా 2లో...



## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

**కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మేంద్ర**

**ఇటీవల బీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న ధర్మేంద్ర**

**డిశ్చార్జ్ తర్వాత ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న బాలీవుడ్ నటుడు**



2లో.

# ఆయుధాలు వదిలేస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

మావోయిస్టులకు లొంగిపోవాలని సూచించింది. ఇటీవల జరిగిన పలు ఎన్ కౌంటర్లలో మావోయిస్టు కీలక నేతలు మరణించిన విషయం తెలిసిందే. పలువురు మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి ప్రభుత్వానికి లొంగిపోతున్నారు. ఈ క్రమంలో తాజాగా మావోయిస్టులు ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోవాలన్న ప్రభుత్వ సూచనపై ఈ లేఖలో సానుకూలంగా స్పందించారు. అయితే, ఆయుధాలు వదిలేందుకు తమకు కొంత సమయం కావాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సమయం ఇస్తే లొంగిపోతామని పేర్కొన్నారు. అప్పటి వరకు కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని, అడవులను జల్లెడ పడుతున్న భద్రతా బలగాలను వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కూంబింగ్ ఆపరేషన్లు వెంటనే నిలిపివేయాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మావోయిస్టులు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈమేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్(ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది.

"ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ ఆయుధాలను వదిలి వేయాలని భావిస్తోంది. అయితే, ఇందుకు ఫిబ్రవరి 15 వరకు సమయం కావాలి. ఈమేరకు గడువు ఇవ్వాలని ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. ఆయుధాలను వదిలి పెట్టాలన్న నిర్ణయంపై సహచరులను సంప్రదించి అందరి ఆమోదం పొందేందుకు సమయం పడుతుంది. కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. ఈ సమయంలో పీఎల్జీఏ వారోత్సవాన్ని నిర్వహించడం సహా అన్ని కార్యకలాపాలను ఆపేస్తాం. అదే సమయంలో కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని ప్రభుత్వాలను కోరుతున్నాం" అని మావోయిస్టులు తమ లేఖలో పేర్కొన్నారు.

## కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం



**(మొదటి పేజీ తరువాయి)**

వీరితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, భూటాన్, కెన్యా, మలేషియా, బ్రెజిల్, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారు.

జస్టిస్ సూర్యకాంత్ సుమారు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ సిఫార్సు చేయగా, అక్టోబర్ 30న కేంద్ర ప్రభుత్వం ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది. 1962 ఫిబ్రవరి 10న హర్యానాలో జన్మించిన జస్టిస్ సూర్యకాంత్, 1984లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2000వ సంవత్సరంలో హర్యానాకు అత్యంత పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. అనంతరం పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన జాతీయ న్యాయ సేవల అథారిటీ (నల్సా)లో కూడా కీలక సేవలు అందించారు.

## అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

**(మొదటి పేజీ తరువాయి)**

అమెరికా ఆంక్షలు రష్యా చమురు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో రష్యా ప్రధాన చమురు ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించేందుకు రష్యా సిద్ధమైంది. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండగా, ఇప్పుడు రెండింతలు అయింది. తాజా తగ్గింపు ధరతో వచ్చే చమురు డిసెంబర్ నెలలో లోడ్ అయి జనవరిలో భారత్‌కు చేరే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. నవంబర్ 21 నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. ఈ వారంలో ఉరల్స్ చమురు ధర భారీగా తగ్గడంతో భారత రిఫైనరీలు తిరిగి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాయి. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమయ్యాయి.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం

**హైదరాబాద్ నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):**

హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న ముఠాలపై మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఒకేసారి మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 8 మంది డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే... చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపినగర్ వద్ద బస్సులో డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను పక్కా సమాచారంతో పట్టుకున్నారు. బెంగళూరు నుంచి న్యూ ఇయర్ ఈవెంట్ల కోసం డ్రగ్స్ తీసుకువస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4.5 గ్రాముల హెరాయిన్ అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడిలో 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి, నిందితులను విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

**(మొదటి పేజీ తరువాయి)**

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు, లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. కాగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉండటంతో విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత హైకోర్టు ఇచ్చే ఆదేశాలకనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది.

**ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: రాణికుముదిని**

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో గుర్తించిన పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**27 జీపీల్లో ఎన్నికలు వాయిదా**

రాష్ట్రంలోని 27 పంచాయతీల్లో కోర్టు కేసులు, ఇతర వివాదాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. అందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామాలతో పాటు కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని రెండు గ్రామాలు ఉన్నట్టు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తెలిపారు. మంగపేట మండలం: 1).కమలాపూర్ 2)నర్సాపూర్ బోరే 3).కొమటి పల్లి 4).కొత్తూరు మొట్ల గూడెం 5).చెరుపల్లి 6).బాలన్నగూడెం 7).నర్సాయిగూడెం, 8).బుచ్చంపేట, 9).తిమ్మంపేట 10).మంగపేట 11).మల్లూరు 12).కొత్త మల్లూరు 13).నర్సింహసాగర్, 14).పూరేడుపల్లి, 15).రమణక్కపేట, 16).చుంచుపల్లి 17).వడగూడెం, 18).రాజుపేట, 19).రామచంద్రునిపేట, 20).వాగొడ్డుగూడెం, 21).కోతిగూడెం, 22).బ్రహ్మణపల్లి, 23).అక్కినపల్లి మల్లారం, 24).దోమెడ, 25).నిమ్మనగూడెం. సైదాపూర్ మండలం: 1).కుర్మపల్లి, 2).రామచంద్రాపూర్

# విద్య ద్వారానే సమాజంలో మార్పు

**(మొదటి పేజీ తరువాయి)**

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 'నైతిక విలువల'పై రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "సమాజంలో నైతిక విలువలను పెంపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు సంకల్పించారు. ఈ పవిత్రమైన బాధ్యతను నాపై ఉంచారు. దీనికోసం ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిని కేబినెట్ ర్యాంకు హోదాతో ప్రభుత్వ సలహాదారుగా నియమించాం. ఎంతోమంది పదవుల కోసం ఆరాటపడతారు. కానీ చాగంటి గారు పదవిని స్వీకరించిన తర్వాత కనీసం ప్రభుత్వ వాహనం గానీ, ఇతర సౌకర్యాలు గానీ తీసుకోలేదు. ఆయన సెల్ ఫోన్ బిల్లు కూడా ఆయనే చెల్లించుకుంటున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మార్గనిర్దేశంలో మీ భవిష్యత్తు కోసం నైతిక విలువల పుస్తకాలను రూపొందిస్తున్నాం" అని తెలిపారు.



**విద్యా వ్యవస్థలో సంస్కరణలు**

ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలను లోకేశ్ ఏకరువు పెట్టారు. "కేవలం 150 రోజుల్లో ఒక్క లిటిగేషన్ లేకుండా 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశాం. టీచర్ల బదిలీల కోసం పారదర్శకమైన చట్టం తెచ్చాం. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేస్తున్నాం. విద్యార్థులకు అందించే కిట్స్‌పై నాయకుల ఫోటోలు తొలగించి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. ప్రతి శనివారాన్ని 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది" అని విద్యార్థులకు సూచించారు.

ఈ బృహత్తర కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు గారు తమకు దిశానిర్దేశం చేయాలని లోకేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ద్రోహం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బడ్జెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ వర్గాలకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఏ ఇతర ప్రభుత్వ చరిత్రలో ఎప్పుడూ చేసిన దాఖలాలు లేవని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యంగా కుల వృత్తులకు సహకారం అందించడం నుంచి మొదలుకొని విద్యారంగంలో ఏర్పాటుచేసిన విద్యా సంస్థల వరకు బీసీ వర్గాలకు కేసీఆర్ చేసిన మేలును తెలంగాణలోని బీసీలు గుర్తుంచుకున్నారని, వారంతా కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్.. కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న మోసంపై ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని పార్టీ నేతలంతా ప్రజల్లోకి తీసుకువెళ్తారని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలోనే పార్టీకి అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

బాలీవుడ్ ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆయన ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నారు. డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన యాక్షన్ కింగ్‌గా, బాలీవుడ్ హీ-మ్యాన్‌గా గుర్తింపు పొందారు. భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత విజయవంతమైన నటులలో ధర్మేంద్ర ఒకరు. ఆరు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు వచ్చాయి. ధర్మేంద్రకు ఇద్దరు భార్యలు కాగా, ఒకరు ప్రకాశ్ కౌర్, మరొకరు హేమమాలిని. ఆయనకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఆయన సూపర్ హిట్ చిత్రాల్లో షోలే, ధరమ్ వీర్, సీతా ఔర్ గీతా, చుప్కే చుప్కే, గజబ్, దో దిశాయే, ఆంఖే, షికార్, ఆయా సావన్ ఝూమ్ కే, జీవన్ మృత్యు, మేరా గావ్ మేరా దేశ్, యాదోం కీ బారాత్ సహా మరెన్నో ఉన్నాయి. 1935 డిసెంబర్ 5వ తేదీన జన్మించిన ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. సన్నీ డియోల్, బాబీ డియోల్, ఇషా డియోల్ ఆయన సంతానమే. 1960లో 'దిల్ బీ తేరా హమ్ బీ తేరా'తో ధర్మేంద్ర నటుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన చివరి చిత్రం 'ఇక్కీస్' త్వరలో విడుదల కానుంది. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి బీజేపీ ఎంపీగా గెలుపొందారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**(మొదటి పేజీ తరువాయి)**

రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు.


# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చె÷-లలెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.



# ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో కీలక నేతలను కలిసిన నారపోగు ప్రసాద్ బాబు



**వైరా/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా కల్లూరులో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నారపోగు ప్రసాద్ బాబు ప్రముఖ నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లను ప్రత్యేకంగా పలకరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు నేతలతో స్వల్పంగా మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం,కార్యకర్తల సమస్యలు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రాంత అభివృద్ధిపై పార్టీ నాయకత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన సూచించినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో టిడిపి తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జిల్లా టీడీపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

## .సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త) :** మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,స్టేషన్ ఘనపూర్ నియోజకవ ర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా తనయు డు, యువనాయకులు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ అన్నారు. స్టేషన్ ఘనపూర్ ఎస్సీ కాలనీకి చెందిన సింగపురం లక్ష్మీ ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ నియోజకవ ర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా కుమారు డు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ సోమవారం వారి నివాసానికి వెళ్లి లక్ష్మీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు. ధర్మసాగర్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మునిగాల ఏలియా ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసు కొని సింగ పురం ఇమ్మానియేల్ రాజ్ సోమవారం వారి నివాసాని కి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా అయన చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటిం చారు. వారి కుటుంబం ఎల్లవేళల అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగ పురం నాగయ్య, మండ ల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ బిక్షపతి,
నారగొని పద్మ,సాల్మ న్ రాజ్, సింగపురం ప్రతిష్, సింగ పురం అభిలాష్, అభిషేక్,వక్కల రవి,సంద్ర సందీప్, ఆరెపెల్లి పవన్, మునిగాల ప్రభాకర్, మునిగాల భిక్షప తీ,సంద్ర కుమార్,మరగోని భిక్షపతీ,మునిగాల సదనం దం గౌడ్, కందుకూరి సురేష్, బాలరాజు,మణి, రాజ్ కుమార్, శివరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు ఎసిపి వసుందర యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టు వసంతరావు

**సత్తుపల్లి/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):**
కల్లూరు కొత్త ఎసిపిగా బాధ్యతలు స్వీకరించిన వసుందర యాదవ్ %ఖూా%ను జర్నలిస్టు వార్త రిపోర్టర్ చీకటి వసంతరావు సోమవారం ఎసిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వసుందర యాదవ్, కల్లూరు డివిజన్‌లో చట్టశాంతి పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ఈ సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.



# మహిళా శక్తి చీరలు పంపిణీ



**రాయపర్తి/నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో సోమవారం మండల తహసిల్దార్,గ్రామ ప్రత్యేక అధికారి ముల్కనూరి శ్రీనివాస్ పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వినోద్ కుమార్, సీసీ యాదగిరి, సిఏ లు శ్రీలత,హసీనా, పుష్ప,మయూరి, అనిత, జలజ, సంధ్య,యాకయ్య,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్,ఎండి మహమ్మద్,ఎండీ ఉస్మాన్, గారే బిక్షపతి,శ్రీనివాస్, ఎస్.కె రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# యువ శక్తి యూత్ సభ్యులకు క్రికెట్ కిట్ అందజేత



**రాయపర్తి/నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని మైలారం గ్రామంలోని యువ శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పంపించిన క్రికెట్ కిట్ ను సోమవారం బిఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి, బిల్లా వెంకట్ రెడ్డి, లేతాకుల సుధాకర్ రెడ్డి,ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధుకర్ రెడ్డి,పెరటి యాదవ రెడ్డి, గబ్బేట కొమురయ్య, గబ్బేట యాకయ్య, గుడెల్లి వెంకటయ్య, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, బాధ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



**రాయపర్తి/నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీపీయు శ్వేత అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వీరభద్ర శర్మ అధ్యక్షతన బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్స్ 1098,181, 14567,1930 తెలుపాలని అన్నారు. విద్యార్లకు బాల్య వివాహ నిర్మూలన చట్టం,పోక్సో యాక్ట్, నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గోరి కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో

# జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ





**భూపాలపల్లి /నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** గోరి కొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. 9వ, 10వ తరగతి క్లాసులు సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో ప్రత్యక్షంగా పాఠాలు చెప్పించి వారి అభ్యాసాన్ని పరీక్షించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.
తరగతుల్లో డిజిటల్ బోధన విధానాల వినియోగంపై ఆసక్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పాఠశాలలో ఉన్న డిజిటల్ పరికరాలను సమర్థంగా ఉపయోగించి విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా గౌతమ్ అనే విద్యార్థి యూనిఫాం లేకుండా క్లాస్‌కి రావడాన్ని గమనించిన కలెక్టర్, కారణం అడగగా "ఈరోజు నా బర్త్‌డే సార్" అని చెప్పాడు. వెంటనే కలెక్టర్ రాహుల్ శర్మ అతనికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, మంచి విద్యార్థిగా ఎదగాలని ఆశీర్వదించారు. తనిఖీ సమయంలో పాఠశాల నిర్వహణ, బోధనా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎంపిడిఓ రాం ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

# యూనిట్ మార్చ్ కి రాయపర్తి వాసి ఎన్నిక...



**రాయపర్తి/నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశమంతా నిర్వహిస్తున్న యూనిట్ మార్చ్ కు మండల కంద్రం కీ చెందిన పెండ్యాల గణేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఈ ఆదివారం హైదరాబాదులోని బిజెపి స్టేట్ ఆఫీస్ నుండి యూనిట్ మార్చ్ ప్రారంభమై నాగపూర్. బైతులు. ఇంద్దోర్ వీధిగా గుజరాత్ లోని ఐక్యత విగ్రహం వద్ద ముగుస్తుంది అన్నారు. జిల్లా నుండి తనను ఎంపిక చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్, బిజెపి పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ లేగ రామ్మోహన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి,బిజెపి రాయపర్తి మండలం అధ్యక్షుడు నూనె అనిల్,బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగందుల శ్రావణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# మృతుని కుటుంబానికి మాజీ ప్రభుత్వ విప్ పరామర్శ



**భీమదేవరపల్లి/నవంబర్24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా సోమవారం మృతుని కుటుంబ సభ్యులను మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు పరామర్శించారు. ఆయన వెంట మంచిర్యాల జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పూదరి చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకన్న, నాయకులు ఊదరి కుమారస్వామి, రాజశేఖర్, మల్లేష్, కుంట రవి, వెంకట్రాజం, మల్లయ్య తదితరులు ఉన్నారు.


# సంఘ విశ్వాసుల ఆశీర్వాదాలతో చిన్నారి హేమ పుట్టినరోజు వేడుక ఘనంగా



**ఏన్కూర్/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని హెబ్రోన్ సంఘ సేవకులు స్టీఫెన్%-%మెర్సీ దంపతుల కుమార్తె హేమ 10వ పుట్టినరోజు వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకకు సంఘ పెద్దలు, సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారిని దీవించేందుకు అందరూ ముందుకు రావడంతో కార్యక్రమం మరింత ఆధ్యాత్మికంగా, ఆనందభరితంగా సాగింది.
కేక్ కట్ కార్యక్రమం అనంతరం అతిథులు హేమకు ఆరోగ్యసౌఖ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు.
వేడుకల్లో తాతయ్య పాస్టర్ జీ. దేవసహాయం, అమ్మమ్మ దేవకరణ, నాయనమ్మ రూతు, అన్నయ్య బిట్టు, సంయుక్త, స్నేహిత్‌తో పాటు సంఘ పెద్దలు నగేష్, రవి, ఎలీషా, రమేష్, విజయ, కర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి కీలకం


## - కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** క్రీడలు శారీరక దృఢత్వానికి మాత్రమే కాక, మానసిక ఉల్లాసాన్ని కూడా అందిస్తాయని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం తెలిపారు. సోమవారం వర్ధన్నపేట మండలం కేంద్రంలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో షటిల్ కోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రధాన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టౌన్ ప్రెసిడెంట్ పెద్దూరి రాజ్ కుమార్ మరియు చెన్న శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈగ మల్లేశం చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అతడు మాట్లాడుతూ, "పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. క్రీడా పోటీల్లో గెలుపు-ఓటములను పట్టించుకోకుండా, క్రీడా స్ఫూర్తిని చూపాలి. ముందుకు సాగాలంటే క్రమపూర్వక సాధననే ప్రధాన మూలం," అని చెప్పారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎక్కడైనా జరిగితే, తన వంతు సహకారం అందిస్తానని ఈగ మల్లేశం పేర్కొన్నారు. ఈ
కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, పెద్దూరి సంజీవ రావు, తుమ్మల యాకయ్య, గోశాల అనిల్, సంకినేని వెంకట్, దర్గయ్య, సారంగపాణి, జనార్ధన్, పాశికంటి రాంచందర్, గోక శ్రీనివాస్, సిలివేరు రాజ్ కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, చిదిరాల కేదారి తదితరులు పాల్గొన్నారు.


# నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిసిన గుమ్మ హరి



**కల్లూరు/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరులో సోమవారం జరిగిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన టిడిపి వీరాభిమాని గుమ్మ హరి ప్రముఖ అతిథులైన నందమూరి రామకృష్ణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్లను మర్యాదపూర్వకంగా కలిసి అభివందనం చేశారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం కొద్ది సేపు వారితో హరి స్నేహపూర్వకంగా చర్చలు జరిపినట్టు తెలిసింది. ఎన్టీఆర్ సేవలు, పార్టీ బలోపేతంపై కూడా చర్చ సాగినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జర్నలిస్టు నారపోగు ప్రసాద్ బాబుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పేదరికం పెన్ను ఆపలేదు

## - సమాజం నేర్పిన పాఠాలే కథలుగా!



**సత్తుపల్లి/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** "సమాజంలో చూసిన సంఘటనలే%ॐ% కుటుంబంలో ఎదుర్కొన్న అనుభవాలే నా కథలకు ఆదారం" అని 'నాన్నే నాహీరో' పుస్తక రచయిత, బాలకవి ఆవుల పోతురాజు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కోడూరు శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవంలో ఆయన బాలఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సత్తుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పోతురాజు మాట్లాడుతూ"పేదరికంలో పుట్టినా పెన్ను వదల్లేదు. సమాజంలో చూసిన నిజజీవిత సంఘటనలు%ॐ% నా కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు%ॐ% ఇవన్నీ కథలుగా మారాయి. వాటినే పుస్తకంగా మలచాను" అని వెల్లడించారు. తెలంగాణ%-%ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో పుస్తకాలు రాసిన తొమ్మిది మంది బాలకవుల్లో ఒకరిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లికి ప్రతినిధిగా పోతురాజు ఎంపిక కావడం విశేషం. బాలకవుల సదస్సులో ఆయన చేసిన ప్రసంగం సభికుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి జె. చెన్నయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రత్తిపాక మోహన్, నిర్వాహకులు గరిపెల్లి అశోక్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదన రాజు, తెలుగు ఉపాధ్యాయిని రమాదేవి వెంకటాచార్యులు పాల్గొన్నారు

# మహిళల సంక్షేమం పేరుతో ప్రచారం

## అమలులో మాత్రం శూన్యం సుదర్శన్ రెడ్డి ఫైరింగ్



**నర్సంపేట/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ చేస్తున్నామని చెప్పుకుంటూ, మహిళా సంఘాల సభ్యులకే చీరలు పరిమితం చేయడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కాలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఎలాంటి ఆంక్షలు లేకుండా బతుకమ్మ పండుగకు చీరలు అందించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా ఒక్కసారి కూడా బతుకమ్మ చీరలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మేనిఫెస్టోలో మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500, విద్యార్థినులకు స్కూటీలు, కుటుంబంలోని అన్ని మహిళలకు సమాన భృతి, వృద్ధులకు 4000 పింఛన్, కళ్యాణలక్ష్మిలో రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన వాగ్దానాలు అన్నీ ఇప్పటికీ మాటలకే పరిమితమైపోయాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మహిళలంతా కలిసి గుణపాఠం చెప్పాలని పీ. సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి



**నర్సంపేట/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** హనంకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఇటీవలే నియమితులైన ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య కూడా పాల్గొన్నారు. వారి కలయిక సందర్భంగా పార్టీ బలోపేతం, గ్రామ%-%మండల స్థాయిలో కాంగ్రెస్ కార్యకలాపాల విస్తరణ, నూతన కమిటీల రూపకల్పన, కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. హనంకొండ జిల్లాలో పార్టీ పునర్నిర్మాణానికి, కీలక స్ట్రాటజీల అమలుకు మాధవరెడ్డి సూచనలు అందించినట్లు నేతలు వెల్లడించారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం దృష్ట్యా వేగంగా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరాన్ని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ బలపడేందుకు పరస్పరం సహకారం అందించుకుంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంలో నిర్ణయించినట్లు సమాచారం

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ





**భీమదేవరపల్లి/నవంబర్24 (జర్నలిస్ట్ వార్త):** హుజురాబాదుకు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది.
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో డాక్టర్ పివి రంగారావు తెలంగాణ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, భీమదేవరపల్లి, ముల్కనూర్ మోడల్ స్కూలులో పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా, స్పెషల్ ఆఫీసర్ పి.జ్యోతి, ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఏ.స్వరూప చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడంతో పరీక్షలకు ముందుగానే సన్నద్ధం చేస్తున్నామని, అందుకు ట్రస్టు వారిని అభినందిస్తున్నానని తెలిపారు ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ సెక్టార్లలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు 2011 సంవత్సరం నుంచి పరీక్ష ప్యాడ్లు అందిస్తున్నానని, ఈ విద్యా సంవత్సరం 10,000 పరీక్ష ప్యాడ్లు ప్రభుత్వ సెక్టార్లలో చదివే విద్యార్థులకు అందించడం లక్ష్యం అని తెలిపారు .ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో అన్యాయం..!

## కనీస సౌకర్యాలు కూడా లేవని ఆగ్రహం - బీజేపీ నాయకుడు పెరుమండ్ల అమరేందర్ రెడ్డి





**హనుమకొండ బ్యూరో / ధర్మసాగర్, నవంబర్24 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు పెరుమండ్ల అమరేందర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. మండల అధ్యక్షుడు భైరపాక కుమార్ ఆధ్వర్యంలో శనివారం కేంద్రాలను పర్యటించిన ఆయన, రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. టెంట్లు, మంచినీటి సదుపాయం, ఫ్యాన్లు, టార్పాలిన్ పరదాలు వంటి ప్రాథమిక వసతులు కూడ ఏర్పాటు చేయకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సమృద్ధిగా నిధులు విడుదల చేస్తుండగా, స్థానికంగా అవి అమలు కావడం లేదని ప్రశ్నించారు. రైతులతో మాట్లాడిన అమరేందర్ రెడ్డి ం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అన్యాయాలు చూస్తే ఆశ్చర్యం వేస్తోందని తెలిపారు. ధాన్యం బరువులో సంచి బరువు 1 కిలో, మట్టి బరువు 1 కిలో పేరుతో 2 కిలోలు తరుగు చేయడం వలన రైతులు భారీ నష్టం చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక క్వింటాల్‌పై సుమారు 5 కిలోల నష్టం వస్తోందని, ఒక్క ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతుకు 50 కిలోల ధాన్యం ం అంటే 3 నుండి 4 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లుతోందని వివరించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం బస్తాలను కుట్టేందుకు కావాల్సిన దారం, డబ్బుడం కూడా ఇవ్వకపోవడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. కేంద్రం ఇచ్చే ప్రతీ రూపాయి సద్వినియోగం కాలేదని, స్థానిక నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

# కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే లక్ష్యం :ఎమ్మెల్యే గండ్ర





**గణపురం/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కోటి మంది మహిళలు ఆర్థికంగా ముందంజలో నిలిచేలా ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గణపురం మండల కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారతపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వడ్ల కొనుగోలు కేంద్రాల బలోపేతం, అద్దె బస్సుల యజమాన్య హక్కుల కల్పన వంటి పథకాలు మహిళలకు నిజమైన ఆదరణగా మారుతున్నాయని పేర్కొన్నారు. తరువాత మండలంలోని 13 మంది లబ్ధిదారులకు రూ.2,88,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందజేశారు. పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి పెద్ద మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కర్కపల్లి గ్రామంలో తలా రూ.50 లక్షలతో రెండు రోడ్లనులక్ష్మారెడ్డిపల్లిలో రూ.30 లక్షలతో ప్రహరీ గోడ, రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, రూ.25 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని
పునాది చేశారు. తదుపరి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, రైతులకు మరింత సౌకర్యాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

# ఎన్నికల కోడ్ ముందు... చీరల పందెం!




## రెండు రోజుల్లో 100శాంతం పూర్తి చేయాలన్న ప్రభుత్వ -సెర్ప్ సిబందిపై పెరిగిన ఒత్తిడి

**ఎమకొండ బ్యూరో/ నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర సర్పంచ్ ఎన్నికల ప్రకటన ఎప్పుడు వెలువడుతుందోనన్న ఊహాగానాల నడుమ, తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో సాగుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ పై వేగం పెంచింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో ఈ కార్యక్రమం నిలిచిపోవొచ్చన్న ఆందోళనతో, ప్రభుత్వం రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు, ముఖ్యంగా సెర్ప్ సిబందికి కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.
ఈ ఆదేశాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ కార్యక్రమం క్షణక్షణం పట్టు పెంచుకుంటుంది. ఉదయం వెలుతురు పడగానే ప్రారంభమయ్యే పనులు రాత్రి దాకా కొనసాగుతున్నాయి. పంపిణీతో పాటు, ప్రతి బెనిఫిషియరీకి సంబంధించిన ఆధార్ ధృవీకరణ, పేస్ ఎంట్రీలు, అప్లోడ్ లాంటి సాంకేతిక ప్రక్రియలు కూడా త్వరితగతిన పూర్తిచేయాల్సి రావడంతో సెర్ప్ సిబంది మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

### సాంకేతిక అడ్డంకులే పెద్ద సవాలు

సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో సరైన వేగం లేకపోవడం, సర్వర్ సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ లోపాలు వంటి సమస్యలు సిబందిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తప్పులేదని అప్‌లోడ్ అనుమతించని సిస్టమ్ కారణంగా కొందరు మహిళలు పలుమార్లు కేంద్రాలకు రావాల్సి వస్తోంది.




అయినప్పటికీ, ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్‌ను అందుకోవాలంటే రాత్రింబగళ్లు పనిచేయకుండా ఉపాయం లేదని సిబంది అంటున్నారు.

### చీరలు అందుకోవడానికి మహిళల రద్దీ

ఇక మరో వైపు చీరలు అందించే కేంద్రాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. ఎక్కడ చూసిన అక్కడ చీరలతో నిండిన బండ్లు, గోదాముల్లో రద్దీ, గ్రూప్ వారీగా పిలుస్తూ పంపిణీ చేసే దృశ్యాలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ఒకచోట చీరలు రాగానే వెంటనే పంపిణీ ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉంటున్నారు.

### ఒత్తిడిలోనైనా సేవ

%"ఎన్నికల కోడ్ ఎప్పుడైనా అమల్లోకి వస్తుంది%ॐ% అందుకే త్వరగా పూర్తి చేయాలి" అని పైస్థాయి నుంచి స్పష్టమైన సూచనలు రావడంతో, సెర్ప్ సిబంది ఆ లక్ష్యాన్ని సాధించేందుకు 'సర్వం చీరే' అంటూ ఫీల్డ్‌లోనే తలమునకలై పనిచేస్తున్నారు. రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ పూర్తి చేయడం చాలా కఠినమైన పని అయినప్పటికీ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తమవంతు పాత్రను సమర్థంగా నిర్వర్తించేందుకు సిబంది ముమ్మరంగా శ్రమిస్తున్నారు.

### ప్రజల్లో చర్చనీయాంశం


ఎన్నికల కోడ్ ముందు ఇంత తొందరగా, ఇంత భారీ స్థాయిలో చీరల పంపిణీ కార్యక్రమం జరగడం ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం చేపట్టిన ఈ డ్రైవ్ పై వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తంగా చూస్తే%ॐ% ఎలక్షన్ కోడ్‌కి ముందే చీరల పంపిణీ పూర్తి చేయాలన్న ప్రభుత్వ నిర్దేశం వల్ల గ్రామాలు, వార్డులు, పంపిణీ కేంద్రాలు ఒక మోతాదైన చలనం, పరుగుపరుగుల దృశ్యాలను సృష్టిస్తున్నాయి.



# ధర్మసాగర్‌లో ‘లెట్స్ ఎన్రిచ్ అవర్ ఇంగ్లిష్’ శిక్షణ ప్రారంభం

## - ఉపాధ్యాయులే మార్పు దాతలు డాక్టర్ రామ్‌ధన్



**హనుమకొండ బ్యూరో /ధర్మసాగర్, నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఇంగ్లిష్ బోధన నైపుణ్యాలను పెంపొందించేందుకు ధర్మసాగర్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్‌లో “లెట్స్ ఎన్రిచ్ అవర్ ఇంగ్లిష్” పేరుతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి డాక్టర్ రామ్‌ధన్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస అవసరాలు మారుతున్న వేళ ఉపాధ్యాయులు తమ ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌ను మరింత మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. బలమైన ఇంగ్లిష్ పునాది విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. స్కూల్ కంప్లెక్స్ కోర్స్ కోఆర్డినేటర్ కె.బి. ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ పిల్లల కేంద్రిత, క్రియాత్మక బోధన, ఫోనిక్స్ ఆధారిత పద్ధతుల ద్వారా ఇంగ్లిష్ నేర్పితే విద్యార్థుల్లో ఆసక్తి, అవగాహన రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మార్పు తీసుకురాగల శక్తి ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. ధర్మసాగర్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 26 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ శిక్షణలో ఉచ్చారణ, పదసంపద, చదవడంలో అవగాహన, వాడుకలో వ్యాకరణం, తరగతి పరస్పర చర్య వంటి అంశాలపై ప్రాక్టికల్ కార్యకలాపాలు, ఉత్తమ పద్ధతుల పంచుకోవడం, ప్రదర్శనలు నిర్వహించనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు రఘోత్తమ్ రెడ్డి, కవిత, రామకృష్ణ, యాస్మీన్ జహాన్ సమన్వయంతో స్కూల్ కంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

# సత్తుపల్లిలో సామూహిక వందేమాతరం

## దేశభక్తి గీతాలాపనతో ఉత్సాహం





**సత్తుపల్లి/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సత్తుపల్లిలో దేశభక్తి జేజిల్లింది. బంకింపచంద్ర చటర్జీ రచించిన అమర గేయానికి 150 ఏళ్ళు నిండిన వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా జరుగుతున్న వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల లో భాగంగా సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో భారీ స్థాయిలో సామూహిక వందేమాతరం గీతాలాపన జరిగింది. జిల్లా కో-కన్వీనర్, బీజేపీ జిల్లా కార్యదర్శి పాలా నాగ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వశాంతి, శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువతలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో వందేమాతరం పూర్తి గీతాన్ని విద్యార్థులు సమూహంగా ఆలపించగా అక్కడి వాతావరణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో సత్తుపల్లి అసెంబ్లీ కంటెస్టెంట్ నంబూరి రామలింగేశ్వరరావు, ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జ్ ఇవి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, భాస్కర్ని వీరంరాజు, మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, టౌన్ సోషల్ మీడియాలో కన్వీనర్ మెరుగు శేషగిరి, జిల్లానేతలు పడిగల మధుసూధనరావు, చీకటి వసంతరావు, నల్లమోతు నాని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, జాతీయవాదులు భారీగా హాజరుకావడంతో సత్తుపల్లిలో దేశభక్తి తరంగం ఉప్పొంగినట్టు కనిపించింది.

# విశ్వశాంతి చిన్నారుల విహారయాత్ర

## ఆటపాటలతో ఉత్సాహంగా గడిపిన చిన్నారులు






**సత్తుపల్లి/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** పుస్తకాలతో బిజీగా గడిపే రోజువారీ పాఠశాల జీవితానికి విరామంగా విశ్వశాంతి విద్యాలయం చిన్నారులు తమ ఉపాధ్యాయులతో కలిసి సత్తుపల్లి మండలం గంగారం పోలీస్ బెటాలియన్ గుట్ట ఆవరణకు విహారయాత్రకు వెళ్లారు. చెట్ల నీడల్లో, ప్రకృతి ఒడిలో ఆటలు ఆడుతూ %-% పాటలు పాడుతూ చిన్నారులు సంతోషంగా గడిపారు.పర్యావరణాన్ని ఆస్వాదిస్తూ, కొత్త ప్రదేశాలను తిలకిస్తూ చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉల్లాసంగా గడిపారు. పిక్నిక్ నిర్వహణకు సహకరించిన బెటాలియన్ అధికారులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా విశ్వశాంతి ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ%ొ% “విహారయాత్రలు పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గిస్తాయి. బయట ఆడే ఆటల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. ఉపాధ్యాయులు%-%విద్యార్థుల మధ్య అనుబంధం బలపడుతుంది. కొత్త ప్రదేశాలు సందర్శించినప్పుడు విద్యా సంబంధిత జ్ఞానం పెరుగుతుంది. సృజనాత్మకత అభివృద్ధికి కూడా ఇవి దోహదం చేస్తాయి” అని పేర్కొన్నారు.

# జనగామ జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా కొర్ర వెంకటేష్ నాయక్





**స్టేషన్ ఘన్ పూర్ /నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త) :** జనగామజిల్లా దిశ కమిటీ సభ్యుడి గా (జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ) స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలం దేశాయి తండ గ్రామానికి చెందిన చెందిన కొర్ర వెంకటేష్ నాయక్ నియమించబడ్డారు.

ఈ సందర్భంగా కొర్ర వెంకటేష్ నాయక్ సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం నివాసంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యని, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగాకలిసి దిశ కమిటీ సభ్యులుగా నియమించి నందుకు దిశ కమిటీ చైర్మన్ ఎంపీ కడియం కావ్యకి,సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పూలమొక్కను అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ సందర్భంగా వెంకటేష్ నాయక్ కి స్వీట్స్ తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య,వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది: ప్రణవ్..

## - త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయండి. - వైద్య రంగానికి మరిన్ని నిధులు తీసుకొస్తా..





**హుజురాబాద్/నవంబర్24 (జర్నలిస్ట్ వార్త):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో విద్య,వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని నిధులు మంజూరు చేసిందని రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి పూర్తి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం హుజురాబాద్ పట్టణ పరిధిలోని కేసీక్యాంపులో గల మహాత్మా జ్యోతి భా పూలే పాఠశాలలో 30 లక్షలతో అదనపు తరగతుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ విషయంలో సమస్యలు తన దృష్టికి రాగానే ఎస్డిఎఫ్ నిధుల నుండి కోటి రూపాయలు విడుదల చేశామని,విద్యార్తులకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచమని,ప్రజా పాలనలో ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని,స్కిల్ నైపుణ్యం కోసం ఐటీఐ(ఏటిసి) మంజూరు చేపించమని అన్నారు.అలాగే వైద్య పరంగా హుజురాబాద్,జమ్మికుంట హాస్పిటల్స్ కు చెరో 15లక్షలు,30 లక్షల నిధులు మంజూరు చేపించామని,ఇంకా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తల్లాడలో కాంగ్రెస్ సీనియర్ నేత జేమ్స్ మృతి

## - నివాళులర్పించిన వైస్ చైర్మన్ కాపా సుధాకర్



**వైరా/నవంబర్24(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కురువెల్ల జేమ్స్ అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రాంతంలో విషాద ఛాయలు వ్యాపించాయి. ఈ విషయం తెలుసుకున్న వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ కొత్త వెంకటగిరి గ్రామానికి వెళ్లి జేమ్స్ భౌతికాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించిన సుధాకర్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జేమ్స్‌కు నివాళులర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, దీవెల కృష్ణయ్య, కాపా రామారావు, దీవెల వెంకటేశ్వరరావు, భూక్య అంజయ్య, ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యూపీ సీఎం యోగిని కలిసిన ‘అఖండ 2’ టీం



**లక్నో/నవంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** డిసెంబర్ 5న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ‘అఖండ 2’ రిలీజ్ దాదాపు దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ జోరు పెరిగింది. ఈ క్రమంలో గురువారం చిత్రబృందం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ను లక్నోలో మర్యాదపూర్వకంగా కలిసింది.సినిమా షూటింగ్ నుంచి ఆసక్తికర విషయాలు సీఎం దృష్టికి తీసుకెళ్లిన టీమ్, మూవీలో ఉపయోగించిన త్రిశూలంను యోగికి అందజేసింది. దీనిపై స్పందించిన సీఎం, చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. నందమూరి బాలకృష్ణ%-%బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో నిర్మితమవుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు భారీ స్పందన వచ్చింది. రిలీజ్ ముందే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలానికి చెందిన బిసి నాయకులు గంట రాజ్ కుమార్ అల్లుడు రాజ్ కుమార్ – శ్రావణిల వివాహ వేడుకలకు సోమవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా కుమారుడు యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక , జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య, ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ బిక్షపతి ,సీనియర్ నాయకులు వక్కల రవి,బీసీ సెల్ నాయకులు బాలరాజు , చిల్పు రు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ మణి ,రాజ్ కుమా ర్, శివరాజు, గణేష్,మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, మండల కార్యదర్శి నారగొని పద్మ,జాఫర్గడ్ సీనియర్ నాయకులు సాల్మన్ రాజ్ , సింగపురం ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

## కీలక సమాచారం రాబట్టిన పోలీసులు

హైదరాబాద్,**నవంబర్ 24(జర్నలిస్ట్ వార్త) :** ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్కలతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి స్నేహితులు, చె÷-లలెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది. క్రిప÷-టో ద్వారా అమౌంట్ బదిలీ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. 1లీశిబి యాప్ మాత్రమే కాకుండా ఇతర యాప్‌ల ద్వారా కూడా డబ్బులు సంపాదించినట్లు తేలింది. పోలీసుల ప్రశ్నలకు ’నేను ఒక్కడినే అన్ని చేశాను. నా వెనుక ఎవరూ లేరు’అని రవి చెప్పినట్లు సమాచారం. రవి కస్టడీకి సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు పిట్ వారెంట్ దాఖలు చేశారు. పలువురు నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నారు. పిట్ వారెంట్ ద్వారా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నారు.